క్లుప్తంగా

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు



గుర్లలో మొక్కజొన్న పంట

గుర్ల: మండలంలోని పెద్దబంటుపల్లి, జమ్ము, గుర్ల, నడుపూరు, ఆనందపురం, గూడెం, కోటగండ్రేడులో మొక్కజొన్న పంట ఆశాజనంగా ఉందని ఏఓ తిరుపతిరావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో సుమారు మూడు వేల ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారని చెప్పారు. పొటాష్, నానో డీఏపీ వినియోగంతో అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. మొక్కజొన్న పంట వేసిన రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.

పెదమానాపురంలో వైద్యశిబిరం



సిబ్బందికి సూచనలు చేస్తున్న వైద్యాధికారి ఆనంద్‌కుమార్

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం వెల్‌నెస్ సెంటర్ వద్ద శుక్రవారం నిర్వహించిన వైద్యశిబిరంలో 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనంద్‌కుమార్ తెలిపారు. బీపీ, సుగర్, నీరసం, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులతో పాటు సాధారణ రోగులను పరీక్షించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



నాగేశ్వరరావు

వేపాడ: వల్లంపూడి పోలీస్‌స్టేషన్ ఏఎస్సైగా నాగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నాగేశ్వరరావు ఏడు నెలలుగా ఇదే స్టేషన్‌లో హెచ్‌సీగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడే ఏఎస్సైగా నియమితులయ్యారు. ఈమేరకు పలువురు ఆయన్ను అభినందించారు.

వీధిలైట్ల ఏర్పాటు



వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

గుర్ల: గుర్ల మండలంలోని చింతపల్లిపేటలో విద్యుత్ స్తంభాలకు శుక్రవారం లైట్లు అమర్చారు. రాత్రి వేళ ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి, లైట్లు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ జమ్ము శ్రీదేవి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు జమ్ము అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి పనులను పర్యవేక్షించారు.

షెడ్లు కూల్చడం తగదు

- అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరరావు



మాట్లాడుతున్న అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరరావు

బొండపల్లి: పేదలకు చెందిన రేకు షెడ్లను కూల్చడం తగదని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు దేవర ఈశ్వరరావు అన్నారు. మండలంలోని గొల్లలపేటలో 13 ఏళ్లుగా రేకుల షెడ్లు వేసుకుని జీవనం సాగిస్తున్న వారిపై కక్ష సాధింపు చర్యలు తగవన్నారు. రెవెన్యూ అధికారులు తొలగించిన షెడ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జాతీయ రహదారి 26కు ఆనుకుని లక్షలాది రుపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి దర్జాగా షాపులు నిర్మించుకున్నారని, అటువంటి వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పెద్దలకు ఓ న్యాయం.. పేదలకు మరో న్యాయమా అని మండిపడ్డారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయం..

- ప్రమాదకరంగా కాపుశంభాం జంక్షన్



ప్రమాదాలకు నిలయంగా మారిన కాపుశంభాం జంక్షన్

చీపురుపల్లి రూరల్ (గరివిడి): చీపురుపల్లి – రాజాం ప్రధాన రహదారిలో కాపుశంభాం జంక్షన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ జంక్షన్‌లో ఎన్నో ప్రమాదాలు జరగగా.. పలువురు మృత్యువాత పడ్డారు. మరెందరో క్షతగాత్రులుగా మిగిలారు. ఈ రహదారిలో నిత్యం లారీలు, బస్సులు కార్లు, ద్విచక్ర వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే కాపుశంభాం జంక్షన్ వద్ద కనీసం స్పీడ్‌బ్రేకర్లు కూడా లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా కాపుశంభాం – అప్పన్నవలస జంక్షన్ మధ్యలో కూడా రాత్రివేళల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. చీపురుపల్లి, రాజాం పట్టణాలకు అనునిత్యం ప్రయాణాలు సాగించే వారితో పాటుగా గరివిడి మండలానికి చెందిన కాపుశంభాం, కొండశంభాం, అప్పన్నవలస, దుగ్గివలస, గదబవలస, తదితర గ్రామాల వారితో పాటు మెరకముడిదాం మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా జంక్షన్‌ల వద్ద స్పీడ్‌బ్రేకర్లు గాని హెచ్చరిక బోర్డులు గాని ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సుల జాడ కరువు..

దత్తిరాజేరు: సంక్రాంతి పండగకు సొంత గ్రామాలకు వచ్చిన వారు తిరుగు ప్రయాణంలో ఇబ్బందులు పడుతున్నారు. సమాయానికి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. గంటల తరబడి రోడ్ల మీద వేచి ఉన్నా సమయానికి బస్సులు రావడం లేదు. ఉన్న బస్సులకు కూడా ఎక్స్‌ప్రెస్ బోర్డులు తగిలించి అధిక మొత్తంలో చార్జీలు వసూలు చేయడంతో ప్రయాణికులు మండిపడుతున్నారు.

మండలంలోని షికారుగంజి, పాచలవలస, దత్తి, కృష్ణాపురం, ఇంగిలాపల్లి, పోరలి, సరయ్యవలస, దత్తిరాజేరు, రామచంద్రాపురం, చింతలవలస, తదితర గ్రామాలకు చెందిన వారు వైజాగ్, విజయనగరం, కాకినాడ, భీమవరం, విజయవాడ, తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే పెదమానాపురం, మరడాం, షికారుగంజి కూడళ్ల వద్ద బస్సులు ఎక్కాల్సి ఉంటుంది. అయితే సకాలంలో బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.



పెదమానాపురం వద్ద ఒడిశా ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదు

- ఆటోడ్రైవర్ కుమార్ ఆరోపణ

గంట్యాడ: ఆటో పోయిందని ఫిర్యాదు చేస్తే పోలీసులు సరిగా స్పందించలేదని ఓ ఆటోడ్రైవర్ ఆరోపించాడు. వివరాల్లోకి వెళితే.. గంట్యాడ మండలం పెదవేమలి గ్రామానికి చెందిన ఒకటిపూడి కుమార్ విశాఖపట్నంలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. సంక్రాంతి పండగ నేపథ్యంలో కుటుంబ సభ్యులతో పాటు పెదవేమలి గ్రామానికి వచ్చాడు. ఈక్రమంలో కొఠారుబిల్లి జంక్షన్‌లో ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు గురువారం వెళ్లాడు. ఆ రోజు రాత్రి ఏడు గంటల సమయంలో కొఠారుబిల్లి జంక్షన్ వద్ద ఆటో నిలిపివేసి అమ్మవారిని దర్శించుకుని తిరిగి 8.15 గంటల సమయానికి వచ్చేసరికి ఆటో కనిపించలేదు. సమీపంలో వెతికినా ఫలితం లేకపోవడంతో అదే రోజు రాత్రి పది గంటల సమయంలో గంట్యాడ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్లగా పోలీసులు మరుచటి రోజు రమ్మన్నారు. శుక్రవారం రెండుసార్లు వెళ్లినా తన నుంచి ఫిర్యాదు తీసుకోలేదని బాధితుడు వాపోయాడు. ఇదే విషయాన్ని ఎస్సై సాయికృష్ణ వద్ద సాక్షి ప్రస్తావించగా.. ఆటోకి సంబంధించిన పత్రాలు తీసుకుని రమ్మన్నామని, వాటిని తీసుకువస్తే ఫిర్యాదు తీసుకుంటామని చెప్పారు.



ఫిర్యాదు చూపిస్తున్న ఆటో డ్రైవర్ కుమార్

నేడు స్వచ్ఛ దివస్ ర్యాలీ

గజపతినగరం: స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో శనివారం ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.కల్యాణి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. నెలలో ప్రతి మూడో శనివారం ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రం చేసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం పదిన్నర గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయం నుంచి గజపతినగరం మార్కెట్ జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు.

4 కేంద్రాల్లో నవోదయ ప్రవేశ పరీక్ష

శృంగవరపుకోట: ఎస్.కోటలోని నాలుగు కేంద్రాల్లో జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షను శనివారం నిర్వహించనున్నట్లు ఎంఈఓ నర్సింగరావు తెలిపారు. పట్టణంలోని నారాయణ కేంబ్రిడ్జ్, రవీంద్ర భారతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలల్లో 864 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు. దీనికోసం 36 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్‌లు పట్టుకుని ఉదయం 10.30 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, 11.15 గంటలకు ప్రశ్నపత్రం ఇస్తారని, మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష రాసేందుకు అనుమతిస్తారని చెప్పారు.

మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై గణేష్

నెల్లిమర్ల: మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై బి.గణేష్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయం పరిధిలో జరుగుతున్న సంఘటనల పట్ల మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, బెల్ట్ షాప్ నిర్వహణ, కోడి పందాలు, పేకాట వంటి అంశాలపై దృష్టిసారించి సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రత్యేకించి బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మహిళా పోలీసులపై ఉందని పేర్కొన్నారు. కావున పైన పేర్కొన్న అంశాలపై దష్టి సారించాలని కోరారు.

ప్రొటోకాల్ పాటించలేదు..



మాట్లాడుతున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ సత్యవంతుడు, ఈశ్వరరావు, తదితరులు

వేపాడ: మండలంలోని కరకవలస పంచాయతీ శివారు మారిక రహదారి పరిశీలనకు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ శుక్రవారం వచ్చారని.. అయితే ఈ కార్యక్రమానికి తమకు అధికారులు ఆహ్వానించినప్పటికీ, ప్రొటోకాల్ పాటించలేదని ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.అప్పారావు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు ఆరోపించారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో వారు మాట్లాడుతూ.. అధికార కార్యక్రమానికి ఆహ్వానించి పార్టీ కార్యక్రమంలా మార్చి మమ్మలను అవమానించడం బాధకరమన్నారు. ఏది ఏమైనా మారిక గిరిజన గ్రామానికి రహదారి నిర్మాణానికి కలెక్టర్ నిధులు మంజూరుచేయడం హర్షణీయమన్నారు.

వేపాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్

వేపాడ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ డే కార్యక్రమం నిర్వహణపై అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ దివస్ డే కార్యక్రమం నిర్వహించాలన్నారు. మండల, గ్రామ స్థాయి కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ దాట్ల కీర్తి, మండల నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ రాములమ్మ, ఎంపీడీఓ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

కల్వర్టు నిర్మించాలని వినతి..



వేపాడ మండలంలోని బల్లంకి – ఆనందపురం రహదారిలో రైవాడ కాలువపై గల కల్వర్టు ఇటీవల కూలిపోయింది. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటరావు, తదితరులు తాటి దుంగలు వేశారు. ఇదిలా ఉంటే రైవాడ కాలువపై శాశ్వత కల్వర్టు నిర్మించాలని కోరుతూ వెంకటరావు, తదితరులు విశాఖ జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కల్వర్టు నిర్మాణానికి కమిషనర్ సానుకూలంగా స్పందించారు. – వేపాడ

వైద్య పరీక్షలు..



గజపతినగరం మండల కేంద్రంలోని ఒకటో సచివాలయం పరిధిలో శుక్రవారం 104 సిబ్బంది ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 59 మంది రోగులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేసినట్లు మరుపల్లి పీహెచ్‌సీ డాక్టర్ సుష్మ తెలిపారు. – గజపతినగరం

పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు..



దత్తిరాజేరు మండలం పెదమానాపురం సబ్ పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు అందిస్తున్నారు. ఆధార్ కార్డులో పుట్టిన తేదీలు, ఇంటిపేర్లు, చిరునామాల్లో తప్పులుంటే సరిచేస్తామని పోస్టల్ అసిస్టెంట్ ఎం. విజయకుమార్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆధార్ శిబిరం ఉంటుందని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. – దత్తిరాజేరు

పింఛన్ల కోసం ఎదురు చూపులు..!

- అర్హత ఉన్నా ఆరునెలలుగా అందని పింఛన్లు
- ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో అసహనం
- దరఖాస్తు చేసుకోవడానికి నేటికీ తెరుచుకోని వెబ్‌సైట్
- ఆవేదన వ్యక్తం చేస్తున్న వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు



పూసపాటిరేగ సచివాలయం

పూసపాటిరేగ: ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అర్ధ సంవత్సరం దాటుతున్నా కొత్త పింఛన్ల మంజూరుకు నోచుకోలేదు.అర్హత ఉన్నా దరఖాస్తు చేసుకోవడానికి కనీసం వెబ్‌సైట్ ఓపెన్ చేయలేదు. అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు నెలలుగా పింఛన్లు మంజూరు కాక ఆశతో ఎదురు చూస్తున్నారు. భర్త చనిపోయిన మహిళలకు అదే నెలలో స్పౌజ్ కోటాలో తాజాగా అనుమతి ఇచ్చి, ఏడాది కాలంగా భర్త చనిపోయి ఎటువంటి ఆదరువు లేకుండా ఉన్న మహిళలు పింఛన్‌కు నోచుకోకపోవడం తీవ్రమైన అన్యాయమని పలువురు వాపోతున్నారు. వందల సంఖ్యలో వితంతువులు పింఛన్ అందక కనీసం మందుల ఖర్చు అయినా లేక అల్లాడుతున్నారు. గతంలో రాజకీయ పార్టీలుకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వలంటీర్లు దరఖాస్తు చేసిందే తడవుగా పింఛన్ మంజూరయ్యేది. ఇప్పుడు పరిస్థితి చూస్తే సంక్షేమ పథకాల మాట దేముడెరుగు కనీసం సామాజిక పింఛన్లు అయినా మంజూరు చేయకపోవడంపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో సుమారు 2000 మంది అర్హులైన పింఛన్‌దారులు ఉన్నారు. పూసపాటిరేగ, భోగాపురం, నెల్లిమర్ల, డెంకాడ మండలాల్లో ఇప్పటికే మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ వందలాది మంది పింఛన్లకు అర్హులైన వారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పూసపాటిరేగ మండలంలోని కుమిలి గ్రామంలో భర్త కాలం చేసి నెలలు దాటుతున్నా పింఛన్‌కు నోచుకోని కోంద్రు లక్ష్మి, ఉప్పాడ అసిరమ్మ, బుర్లె అప్పయ్యమ్మ, పొట్నూరు రమణమ్మ, గొండేల రాములమ్మ, ఎడ్లపిల్లి లక్ష్మిలు ఉన్నారు. పూసపాటిరేగకు చెందిన పిల్ల బుచ్చమ్మ భర్త కాలం చేసి ఏడాది దాటుతున్నా నేటికీ పింఛన్‌కు నోచుకోలేదు. అర్హత ఉన్న వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయాలకు అర్హులు వెళ్తున్నా వెబ్‌సైట్ ఓపెన్ కాలేదని చెప్పి వెనక్కి పంపిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి నిరంతరాయంగా వెబ్‌సైట్ ఓపెన్‌లో ఉండేది. కానీ నేటి పరిస్థితి చూస్తే భిన్నంగా ఉంది.

పింఛన్ల తొలగింపు కుట్ర..!

సార్వత్రిక ఎన్నికల సమయంలో సామాజిక పింఛన్లకు సంబంధించిన వెబ్‌సైట్ నిలిపివేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు వెబ్‌సైట్ ఓపెన్ చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. నెలరోజుల క్రితం పింఛన్ల తనిఖీలో భాగంగా పైలట్ ప్రాజెక్టులో జిల్లాలోని పూసపాటిరేగ మండలం వెల్దూరు సచివాలయాన్ని ఎంపిక చేసి 11 బృందాలుగా అధికారులు పింఛన్లు తనిఖీ చేశారు. కొత్త పింఛన్లు ఎలాగూ మంజూరు చేయలేదు. ఉన్న పాత పింఛన్లను తొలగించే కుట్ర చేస్తున్నారా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు సామాజిక పింఛన్లకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇచ్చి మంజూరు చేయాలని కోరుతున్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి..



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

- ఎంపీపీ చల్లా చలంనాయుడు

బొండపల్లి: ఏపీ సమగ్ర భూ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు అన్నారు. మండలంలోని బి.రాజేరులో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రెండో విడత సమగ్ర భూసర్వే నిర్వహించనుందన్నారు. రైతులు సర్వేకు సంబంధించి అన్ని అంశాలను పూర్తిగా తెలుసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. తహసీల్దార్ డోల రాజేశ్వరరావు మాట్లాడుతూ, సర్వే అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈదుబిల్లి కృష్ణ, వీఆర్ఓ గెద్ద నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.